సాక్షి
కాకినాడ
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



బడోపేతం

ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే దిశగా అనేక పథకాలు అమలు చేస్తోంది.


8లో



స్వామియే.. శరణమయ్యప్పా..

అయ్యప్ప స్వామి దీక్ష.. క్రమశిక్షణ వైపు నడిపించే భక్తి మార్గం. కులమతాలకు అతీతంగా భక్తి. నియమాలతో సాగే అయ్యప్ప మాలధారణకు ఏటా ప్రాధాన్యం పెరుగుతోంది.

నీటి విడుదల తగ్గింపు



ధవళేశ్వరం: భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు నీటి విడుదలను మరింత తగ్గించారు. తూర్పు డెల్టాకు 300 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

దోష రహిత ఓటర్ల జాబితాపై భేటీ



వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో కిషోర్

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్ట్రో రిజిస్ట్రేషన్ అధికారి ఈట్ల కిషోర్ మంగళవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ మార్పులు, చేర్పులు, అదే విధంగా 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా చేర్చామన్నారు. ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఫారం 6, 642, ఫారం-7 189, ఫారం-8 497 దరఖాస్తులు వచ్చాయని రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, ఎస్ అప్పారావు, కేవీ రామయ్య, కె కృష్ణమోహన్, రూరల్ తహసీల్దార్ మురార్జీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ప్రసాద్



ఫెడరేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాదాచార్యులు

గండేపల్లి: విశ్వ హిందూ మహాసంఘ్ (వరల్డ్ హిందూ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షునిగా తాళ్లూరులోని జీయర్ స్వామి మఠాధిపతి పాడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యుల్ని నియమించినట్టు మఠాధిపతులు తెలిపారు. ఢిల్లీలో గల అతి పురాతన కాళికామాత పీఠంలో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వారు పేర్కొన్నారు. విశ్వ హిందూ మహాసంఘ్, గోరక్షా పీఠాధీశ్వర్లు, సంరక్షకులు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహారాజ్, జాతీయ అధ్యక్షులు అవధూత యోగి సురేంద్రనాథ్ మహారాజ్, జాతీయ కార్యనిర్వాహక మంత్రి యోగి రాజకుమార్ నాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. సనాతన భారతీయ ధర్మ పరిషత్ సంస్థాపక అధ్యక్షుడు, ముందూరు యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధీశ్వరులు కృష్ణచరణానంద స్వామిని జాతీయ కార్యదర్శిగా, దక్షిణ భారత అధ్యక్షుడుగా నియమించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు మఠాధిపతులు, సనాతన ధర్మం ప్రచారకర్తలు, తదితరులు అభినందనలు తెలిపారు.

సుడిగాలుల అలజడి

- తీరం దాటిన తుపానుతో ఊపిరి పీల్చుకున్న రైతులు
- ప్రభుత్వ స్పందనతో తప్పిన ముప్పు
- సుడిగాలులతో భయాందోళన
- పలుచోట్ల కూలిన చెట్లు..ఇళ్ల పైకప్పులు



కొత్తపల్లి మండలం కొండెవరంలో సుడిగాలి బీభత్సానికి ధ్వంసమైన పెంకుటిళ్లు

సాక్షిప్రతినిధి, కాకినాడ: రెండు రోజులుగా కంటిపై కునుకు లేకుండా చేసిన మిచాంగ్ తుపాను ఎట్టకేలకు తీరం దాటింది. దీంతో గండం గట్టెక్కిందని అన్నదాతల మనసు తేలికపర్చుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల సమీపాన తీరం దాటిందనే సమాచారం తెలిసి ఊరట చెందారు. గుండెల్లో గుబులు రేకెత్తించిన ఈ తుపానుపై మొదటి నుంచి ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. సాయంత్రం వేళ జిల్లాలోని పలు చోట్ల సుడిగాలి ఆకస్మికంగా బీభత్సం సృష్టించింది. భీకర గాలులు వీస్తూ భయకంపితులను చేసింది. గండేపల్లి,అన్నవరం, యూ కొత్తపల్లి మండలాల్లో ఈ గాలులకు కొన్ని ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ చెట్లు నేలకూలాయి. రోడ్డు మీద వాహనాలు సైతం కింద పడిపోయాయి. జనం సుడిగాలి సమయంలో తీవ్ర ఆందోళన చెందారు. తుపాను తీరం దాటినా రాత్రి పలు ప్రాంతాల్లో వర్షం పడుతూనే ఉంది. కాగా వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యంతో రైతులు నష్టపోకుండా కళ్లాల్లోనే ఆఫ్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేయాలనే అధికారుల ప్రయత్నానికి మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షం ప్రతిబంధకమైంది. దీంతో ధాన్యాన్ని విక్రయించుకునే వెసులుబాటు కనిపించక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లలకు తరలింపునకు ఏర్పాట్లు

పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోటలో ఆరువేల మెట్రిక్‌టన్నుల ధాన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాలతో కొనుగోలుకు ఆటంకం ఏర్పడింది. ఆ ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్ట ప్రాంతం జగ్గంపేటలోని పలు గ్రామాల్లో రైతులు తడిసిన ధాన్యాన్ని వర్షాలు తగ్గడంతో ఒడ్డుకు చేర్చుకునే పనిలో ఉన్నారు. కాట్రావులపల్లిలో రోడ్లపైన ఉన్న ధాన్యాన్ని బాలాజీ రైస్‌మిల్లుకు తరలించారు. పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు ఆధ్వర్యంలో అధికారులు ధాన్యం సేకరణను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు.

సుడిగాలి బీభత్సం

జిల్లాలోని మంగళవారం సాయంత్రం సుడిగాలి విధ్వంసం సృష్టించింది.

- గండేపల్లి-మల్లేపల్లి గ్రామాల మధ్య పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.
- తొండంగి మండలం ఎ కొత్తపల్లి, తలుపులమ్మ మెట్టలో ఐదు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. రెండు ఆటోలు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, చెట్లు నేలకొరిగాయి.
- ఉప్పాడ కొత్తపల్లి కొండెవరంలో ఈదురుగాలులకు మూడు పెంకుటిళ్లు కూలిపోగా, ఒక పెంకుటిల్లు పైకప్పు ఎగిరిపోయింది.
- ఉప్పాడ తీరంలో సముద్ర అలలు మంగళవారమూ ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డుపై రాకపోకల నిలిపివేత కొనసాగించారు.
- కోతకు గురవుతోన్న ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరిశీలించారు.
- కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, యాంకరేజ్ పోర్టులలో లంగరేసిన షిప్‌లను విపత్తుల నివారణ అధికారుల సూచనల మేరకు పోర్టు అధికారి మురళీధర్ పర్యవేక్షణలో డీప్‌సీలోకి పంపించారు.
- గడచిన రెండు రోజులుగా పోర్టులో కార్యకలాపాలు నిలిచిపోయాయి.
- మత్స్యకారులు వేటకు వెళ్లకుండా బోట్లను తీరంలో లంగరు వేయించారు.

రైతులకు ధైర్యం చెప్పిన కన్నబాబు

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంటను కాపాడుకునేందుకు రైతులకు గోనెసంచులు, బరకాలు అందజేశారు. తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ కరప మండలం పలు గ్రామాల్లో పనలు నీట నానుతున్నాయి. యండమూరు, వాకాడ, గొడ్డటిపాలెం, వలసపాకల తదితర గ్రామాల్లో వర్షంలో నానుతున్న పనలను, ధాన్యం రాశులను రైతులు ఒబ్బిడి చేసుకుంటున్నారు. కొవ్వూరు, తిమ్మాపురంలో నేలనంటిన వరి పనలను రైతులు ఒడ్డుకు చేర్చుకుంటున్నారు.అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారులు దగ్గరుండి ధాన్యం సేకరించి రైసుమిల్లుకు తరలించారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తడిసిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు ధైర్యం కల్పించారు.

జిల్లాలో సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు 990.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 47.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాజులూరు మండలంలో అత్యధికంగా 79.8 మి.మీ.,రౌతులపూడి మండలంలో అత్యల్పంగా 24.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కళ్లాల్లోనే సేకరణ



తడిసిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. బరకాలు కూడా విరివిగా రైతులకు పంపిణీ చేశాం. తడిసిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేస్తాం. తడిసిన ప్రతి గింజా కొనుగోలుచేస్తాం. ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో ధాన్యం కళ్లాల నుంచే సేకరించేలా ఆదేశాలు జారీచేశాం. ఇందుకోసం ధాన్యం కళ్లాల్లోను, లే అవుట్‌లు, రోడ్లపై ఉన్న ప్రతి మండలంలో రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త భాగస్వామ్యంతో బృందాలు ఏర్పాటుచేశాం.

– కృతికాశుక్లా.జిల్లా కలెక్టర్, కాకినాడ

నేడు పాఠశాలలకు సెలవు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తుపాను నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి మంగళవారం తెలిపారు. తుపాను ప్రభావం ఇంకా ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు సెలవు ప్రకటించామని చెప్పారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.

మండలాల్లో వర్షపాతం(మి.మి.లలో)

కాజులూరు	79.8
తాళ్లరేవు	76.8
పెదపూడి	74.8
కాకినాడ రూరల్	72.6
కరప	69.4
పెద్దాపురం	66.4
కాకినాడ అర్బన్	60.2
సామర్లకోట	55.8
పిఠాపురం	54.6
యు.కొత్తపల్లి	45.2
గొల్లప్రోలు	44.4
తొండంగి	37.2
శంఖవరం	35.2
కిర్లంపూడి	32.6
గండేపల్లి	28.8
జగ్గంపేట	28.6
ప్రత్తిపాడు	28.0
తుని	26.6
ఏలేశ్వరం	25.4
కోటనందూరు	24.2
రౌతులపూడి	24.0



కరప మండలం అరట్లకట్టలో అధికారులు తడిసిన ధాన్యాన్ని తరలిస్తోన్న దృశ్యం



కాకినాడ రూరల్ కొవ్వూరులో నేలకొరిగిన వరిపంట



శంఖవరం మండలం అన్నవరం పంపా రిజర్వాయర్‌లో సుడిగాలి ఇలా...

తడిసి ముద్దయిన శ్రీగోకులం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి ఈశాన్య భాగాన గల సప్త గోకులం గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి తడిసి ముద్దయింది. గోకులంలోని ఎనిమిది ఆవులు, మధ్యలోని శ్రీకృష్ణుని విగ్రహం, పూజలు చేసే అర్చకస్వాములు వర్షానికి తడిసి ముద్దయ్యారు. గత ఏడాది గోకులం పై కప్పు రెల్లుగడ్డితో నేయించారు. దూరం దూరంగా నేయడంతో తరువాత కురిసిన వర్షాలకు వర్షపు నీరు లీకయి ఆవులతో బాటు అర్చకులు , భక్తులు కూడా తడిసిపోయారు. దీంతో అధికారులు శ్రీగోకులం పైకప్పునకు ప్లాస్టిక్ షీట్లతో వర్షపునీరు లోపలకు రాకుండా ఏర్పాటు చేశారు. ఏడాది జరగడంతో ప్లాస్టిక్ షీట్లు చిరిగిపోయి చీలికలు, పేలికలుగా వేలబడతున్నాయి. మరలా వర్షపునీరు గోకులంలోకి లీకవుతుంటే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గోకులం ద్వారా దేవస్థానానికి ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వస్తోంది. అయినా అధికారులు శాశ్వత ప్రాతిపదికన గోకులం నిర్మించడం లేదు. రెల్లుగడ్డి పాతబడి ఎండ వాన లోపలకు వస్తున్న సమయంలో మరలా రూ.లక్షలు ఖర్చు పెట్టి రెల్లుగడ్డితో పైకప్పు నేయిస్తున్నారు తప్ప శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవడం లేదు. రెల్లుగడ్డి పైకప్పు బదులు శ్లాబ్ వేసి దానిపై అందానికి రెల్లుగడ్డి వేస్తే అటు సంప్రదాయంగా, ఇటు ఎండ వాన నుంచి రక్షణ ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రత్నగిరి శ్రీగోకులం

నేడు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికల జట్లు ఎంపిక జరుగుతుందన్నారు.

అండర్-14 విభాగంలో 1-1-2010 తరువాత పుట్టిన వారు, అండర్-17 క్యాడెట్ విభాగంలో 1-1-2007 నుంచి 30-11-2010 మధ్యలో పుట్టిన వారు అర్హులన్నారు. ఈ ఎంపికలు కాకినాడ రామారావుపేటలోని శివాలయం వీధిలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు అర్హత ధ్రువీకరణ పత్రాలతోఎంపికలకు హాజరుకావాలని కోరారు.

11న సామాజిక సాధికార యాత్ర

రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

సామర్లకోట: పెద్దాపురంలో ఈనెల 11న సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుంది. ఈ యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకొని యాత్రను విజయవంతం చేయాలన్నారు. సభను ముందుగా సామర్లకోటలో నిర్వహించాలని నిర్ణయించగా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి సామర్లకోట పర్యటనకు రావడంతో పెద్దాపురంలో ఏర్పాటు చేయాలని ఇక్కడి నాయకులు పట్టుపట్టారు. దీంతో పెద్దాపురం మెయిన్ రోడ్డులో యాత్రను నిర్వహించాలని తీర్మానించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న మేలును దృష్టిలో ఉంచుకొని సభకు ప్రతీ కుటుంబం నుంచి ఒకరు తప్పని సరిగా వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఏలేశ్వరం బీసీ సంఘ నాయకుడు అలమండ చలమయ్య, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, రెండు మండలాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

బంగారు కొండ.. భవితకు అండ



చిన్నారికి బంగారుకొండ పోషకాహార కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత (ఫైల్)

- కలెక్టర్ ఆలోచనకు సత్ఫలితాలు
- సాధారణ స్థితికి 478 మంది పిల్లలు
- కొత్తగా 38 మంది గుర్తింపు

రాజమహేంద్రవరం రూరల్: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించి, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులు చేసేందుకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత రూపొందించిన బంగారు కొండ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. వయసుకు తగిన బరువు, ఎత్తు లేని ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులను గుర్తించి, వారికి ఆరునెలల పాటు 8 రకాల పోషకాహారం అందించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ ఏడాది జూన్ 14న హోంమంత్రి తానేటి వనిత, ఇతర ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

1,283 మంది గుర్తింపు

తీవ్ర బలహీనంగా, తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు, సరైన ఎదుగుదల లేని 1,283 మందిని కలెక్టర్ నేతృత్వంలో ఐసీడీఎస్ సిబ్బంది గుర్తించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గోరుముద్ద పథకాల ద్వారా అందిస్తున్న పోషకాహారంతో పాటు అదనంగా ఎనిమిది రకాల పోషకాహారాన్ని అందించనున్నారు. కలెక్టర్ మాధవీలత ఈ ఆలోచనకు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకువచ్చారు. ఆరు నెలల పాటు నెలకు రూ.500 విలువైన ఎనిమిది రకాల పోషకాహార కిట్లను పంపిణీ చేసేందుకు రూ.3 వేలు అందించేందుకు ముందుకు వచ్చారు. పోషకాహారకిట్లకు సహకరించిన దాతలకు బాలమిత్రలుగా నామకరణం చేశారు.

వైద్యుల పర్యవేక్షణ

బాలమిత్రలు ఒక్కొక్క చిన్నారిని దత్తత తీసుకుని ప్రతి బుధవారం వారింటికి వెళ్లి ఆ చిన్నారి బరువు, ఎత్తు తూయడంతో పాటు బంగారుకొండ యాప్‌లోనూ, వెబ్‌సైట్‌లోనూ వివరాలు నమోదు చేసేవారు. దీనిద్వారా ఆ చిన్నారుల ఎత్తు, బరువుల్లో మార్పు వస్తున్నాయా, లేదా అన్న విషయాన్ని గుర్తించడంతో పాటు వైద్యసేవలు అవసరమైతే సంబంధిత వైద్యాధికారులు పరీక్షలు చేసి మందులను ఇవ్వడం జరుగుతుంది. పిల్లలను లోప పోషణ స్థితి నుంచి సాధారణ స్థితికి వచ్చే వరకూ నిరంతర పర్యవేక్షణ చేస్తారు.

సాధారణ స్థితికి 478 మంది

బంగారుకొండ కార్యక్రమాన్ని ప్రారంభించి ఐదు నెలలు పూర్తయ్యింది. 1,283 మంది చిన్నారుల్లో 478 మంది సాధారణ స్థితికి వచ్చారు. మిగిలిన చిన్నారుల్లో కొంతమందిలో ఆరోగ్య సమస్యలు ఉండడం వల్ల బాలమిత్రలతో పాటు నిరంతరం ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్ వైజర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో వీరితో పాటు మరో 38 మంది పోషకాహార లోపం, వయసుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలను గుర్తించారు.

విజయవంతం



జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన బంగారుకొండ కార్యక్రమం ద్వారా ఐదు నెలల వ్యవధిలో తీవ్ర పౌష్టికాహార లోపం, ఎదుగుదల లోపం ఉన్న 1,283 మంది చిన్నారుల్లో 478 మంది సాధారణస్థితికి రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు అదనపు ఆహారం అందిస్తున్నాం. జిల్లాలో మరో 38 మందిని గుర్తించాం. బాలమిత్రలుగా మరింతమంది దాతలు ముందుకు రావాలి. జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అందరి సహకారంతో బంగారుకొండ కార్యక్రమం విజయవంతమైంది.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్

నిరంతరం పర్యవేక్షణ



బంగారుకొండ కార్యక్రమంలో బాలమిత్రలు దత్తత తీసుకున్న చిన్నారులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ప్రతి బుధవారం బాలమిత్రలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వెళ్లి పిల్లల బరువును తూచి, ఎత్తును కొలిచి యాప్‌లో, వైబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల్లో చాలామందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలకు సంబంధించి స్పెషలిస్టు వైద్యులచే పరీక్షలు చేయించి, ఆ చిన్నారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నాం.

– కె.విజయ కుమారి, జిల్లా స్త్రీ.శిశు సంక్షేమ సాధికారిత అధికారి

సంతోషంగా ఉంది



మా అబ్బాయి కొక్కిరపాటి వరుణ్ కుమార్ వయసు మూడేళ్లు. 87 సీఎం ఎత్తు, 10.4 కిలోల బరువు ఉండేవాడు. హోంమంత్రి తానేటి వనిత నా కుమారుడిని దత్తత తీసుకుని బంగారుకొండ పౌష్టికాహార కిట్‌ను ప్రతినెలా అందిస్తున్నారు. పోషకాహారం తీసుకున్న తరువాత 92 సీఎం ఎత్తు, 11.7 కిలోల బరువుకు వచ్చాడు. చాలా సంతోషంగా ఉంది.

– కొక్కిరపాటి సునీత, దొమ్మేరు

కొండంత భరోసా



మా అబ్బాయి చాకలి భవ్యేష్ అభ్యంత్ వయసు ఏడాదిన్నర. బంగారుకొండ కార్యక్రమం మొదలుపెట్టిన జూలైలో బరువు 7.8 కిలోలు, ఎత్తు 74 సీఎం ఉండేవాడు. ఇప్పుడు బరువు 8.4 కిలోలు, ఎత్తు 77 సీఎం పెరిగాడు. పోషకాహారం తీసుకోవడం వల్ల మా అబ్బాయి పెరుగుదల బాగుంది. బంగారుకొండ కిట్లు ఇవ్వడంతో పాటు బాలమిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. – చాకలి లీలాకుమారి, రాజానగరం

ఆరోగ్యం మెరుగైంది



మా అబ్బాయి గొందేశి పవన్ తేజకు ఐదేళ్ల వయసు. మొదట బరువు 15.3 కిలోలు, ఎత్తు 99 సీఎం ఉండేవాడు. పోషకాహారం తీసుకున్న తరువాత బరువు 17.3 కిలోలు, ఎత్తు 102 సీఎంకి పెరిగాడు. బంగారుకొండ పోషకాహారం తీసుకున్న తరువాత ఆరోగ్యంగా, హుషారుగా ఉంటున్నాడు. ప్రతి బుధవారం బాలమిత్ర, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త పర్యవేక్షిస్తున్నారు.

– గొందేశి మహాలక్ష్మి, గణేష్ దంపతులు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీలకు పృథ్వీరాజ్


బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన పృథ్వీరాజ్

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సీహెచ్ పృథ్వీరాజ్ జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పెద్దిరాజు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఇంటర్ కాలేజియేట్ అండ్ ఇంటర్ యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ 2023-24 లో భాగంగా ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న పృథ్వీరాజ్ ఉత్తమ ప్రతిభ కనపరిచి, చండీఘడ్ స్టేట్ మొహాలీ యూనివర్సిటీలో ఈ నెల 25 నుంచి 30 వరకూ జరగనున్న జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. పృథ్వీరాజ్‌ను ప్రిన్సిపాల్, పీడీ కె.కనకరాజు, అధ్యాపకులు అభినందించారు.

ఆల్ ఇండియా బాడ్మింటన్‌లో రన్నర్‌గా అభిషేక్


ట్రోఫీని అందుకున్న అభిషేక్

రామచంద్రపురం: యోనెక్స్-సన్ రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్ -2023లో తమ విద్యార్థి బోను అభిషేక్ అండర్ -15 డబుల్స్ కేటగిరీలో రన్నర్‌గా నిలిచినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత జి.వి.రావు మంగళవారం విలేకరులకు తెలిపారు. బెంగళూరు వేదికగా కర్ణాటక బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5 వరకు ఈ టోర్నీ జరిగిందన్నారు. అభిషేక్ రూ.15,000 నగదు పురస్కారంతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకున్నాడన్నారు. స్కూల్ అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి ఆర్.ఉమాదేవి, హెచ్.ఎం.ముత్యాల చిట్టిబాబు అభినందనలు తెలియజేశారు.

బడోపేతం

- జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విస్తృతంగా తనిఖీలు
- నాణ్యమైన విద్య, వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

రాయవరం: ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే దిశగా అనేక పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం విద్యార్థుల అభ్యసనా స్థాయిలకు అనుగుణంగా విద్యను అందించేందుకు పర్యవేక్షణను పటిష్టం చేయడం ద్వారా పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందాయా? లేదా? మధ్యాహ్న భోజనం సక్రమంగా అందుతోందా? లేదా? తదితర విషయాలను పరిశీలించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు.

వివరాలు ఇలా..

జిల్లా	ప్రభుత్వ/ఎయిడెడ్ పాఠశాలలు	విద్యార్థులు	ప్రైవేట్ పాఠశాలలు	విద్యార్థులు
తూర్పు	1,011	2,12,269	553	1,44,657
కోనసీమ	1,579	1,10,177	456	1,13,894
కాకినాడ	1,285	1,71,338	574	1,33,732

పక్కాగా పర్యవేక్షణ చేసేలా

అదే మండలంలోని ఎంఈవోలతో పర్యవేక్షణ చేయడం ద్వారా ఆశించిన ఫలితాలు రావనే ఉద్దేశంతో విద్యాశాఖ వినూత్నంగా ఆలోచన చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారితో పాటుగా, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఇప్పటికే పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ఒక మండలంలోని ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలను పక్క మండలంలో నియమించి, వారితో పాఠశాలలను తనిఖీ చేయిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా వాస్తవ పరిస్థితి తెలుస్తుందని జిల్లా విద్యాశాఖ భావిస్తోంది. అందుకనుగుణంగా ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలను పర్యవేక్షణ కమిటీల్లో నియమించారు. పాఠశాలల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, విద్యాబోధన ఏ విధంగా ఉంది? ఉపాధ్యాయుల పనితీరుపై కమిటీల నివేదికలను జిల్లా విద్యాశాఖకు అందజేయనున్నాయి. తనిఖీల అనంతరం గుర్తించిన లోపాలతో కమిటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ నిర్ణయంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పలువురు భావిస్తున్నారు.

మండలానికి ఇద్దరు ఎంఈవోలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను సుందరీకరించి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియంను పరిచయం చేయడంతో పాటు వర్చువల్ విధానంలో విద్యాబోధనకు కృషి చేస్తోంది. టోఫెల్ విధానంలో పరీక్షలు నిర్వహించింది. 8వ తరగతిలోనే విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేసింది. విద్యావ్యవస్థను పటిష్టం చేసే చర్యల్లో భాగంగా, విద్యాపరమైన కార్యక్రమాలను పర్యవేక్షణ చేయడానికి మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ పకడ్బందీగా అమలు చేసేందుకు ఎంఈవోలను నియమించింది.


పాఠశాలల్లో తనిఖీలు చేపడుతున్న ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు

విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం



జిల్లా విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం ఎంఈవోలు, పక్క మండలంలోని పాఠశాలల్లో తనిఖీలు చేపడుతున్నాం. కార్యక్రమాల అమలు తీరు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు తెలుసుకునేందుకు ఈ తనిఖీలు చేస్తున్నాం. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయనున్నాం.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈవో, కొత్తపేట

వాస్తవ పరిస్థితి తెలుస్తుందనే..



ప్రతి విద్యార్థి చదువుతున్న తరగతికి సంబంధించిన అభ్యసన సామర్థ్యాలను సాధించాల్సి ఉంది. తనిఖీల ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి తెలుస్తుంది. విద్యా ప్రమాణాల మెరుగు పర్చేందుకు ఈ చర్యలను తీసుకున్నాం. తనిఖీల అనంతరం ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

వ్యక్తిపై హత్యాయత్నం


బాధితుడు దుర్గాప్రసాద్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న ఎస్సై సాగర్

కొత్తపేట: ఒక యువతితో యువకుడు అసభ్యంగా మాట్లాడిన వివాదం ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి దారితీసింది. ఈ వివాదంలో పింప్రాళ్ల దుర్గాప్రసాద్‌ను పింప్రాళ్ల చిన్నయ్య అనే యువకుడు చాకుతో పొడిచి గాయపరిచాడు. స్థానిక ఎస్సై జ్వాలాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన పింప్రాళ్ల దానయ్యతో పాటు అతని కుమార్తె, బంధువులు ఈ నెల 3న గ్రామంలోని వరి చేలో గడ్డి పనికి వెళ్లారు. అక్కడ పింప్రాళ్ల చిన్నయ్య.. దానయ్య కుమార్తెతో అసభ్యంగా మాట్లాడాడు. ఆ విషయాన్ని ఆమె తన తండ్రికి చెప్పగా దానయ్య, చిన్నయ్యను నిలదీయడంతో గొడవ జరిగింది. చిన్నయ్య, దానయ్యను కొట్టి గాయపరిచాడు. ఈ గొడవ గురించి మంగళవారం పెద్దల సమక్షంలో తగవు పెట్టారు.

దానయ్య అన్న కుమారుడు పింప్రాళ్ల దుర్గాప్రసాద్ తన చిన్నాన్న తరపున 3వ తేదీన జరిగిన గొడవ గురించి పెద్దలకు చెబుతుండగా చిన్నయ్య కేకలు వేస్తూ తనతో తెచ్చుకున్న కూరగాయలు కోసే చాకుతో దుర్గాప్రసాద్ పొట్టలో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. వెంటనే అక్కడున్న అతనిని బంధువులు కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స జరిపి, ఉన్నత వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

అనారోగ్యం, అప్పుల బాధతో ఆత్మహత్య



రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరానికి చెందిన రైతు రెడ్డి ఏడుకొండలు(60) అనారోగ్యం, అప్పుల బాధతో గత నెల 28న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రామచంద్రపురం ఎస్సై డి.సురేష్‌బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. గడ్డి మందు సేవించిన రైతును తొలుత రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి సమాచారం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

- గ్యాస్ కట్టర్, ఆక్సిజన్ సిలిండర్ వదిలేసి పరారైన దుండగులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ కిషోర్


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రంగంపేట: ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నించి అది తెరుచుకోక పోవడంతో దుండగులు పరారైన సంఘటన రంగంపేట మండలం వడిశలేరులో జరిగింది. దీనిపై మంగళవారం రాత్రి ఎస్సై పి.విజయ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడిశలేరు శివారు సూర్యనారాయణపురం ఏడీబీ రోడ్డు పక్కన ఉన్న కెనరాబ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి సుమారు 2 గంటలు దాటిన తరువాత ఈ ఘటన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలకు మట్టిపూసి ఆక్సిజన్ సిలిండర్, గ్యాస్ కట్టర్ సహాయంతో ఏటీఎంను తెరవడానికి ప్రయత్నించారు. విఫలం కావడంతో ఆక్సిజన్ సిలిండర్, గ్యాస్ కట్టర్ అక్కడే విడిచి పరారయ్యారు. మంగళవారం కెనరాబ్యాంకు మేనేజర్ అల్లు సందీప్ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై చెప్పారు. ఈ ఘటనలో సొత్తు చోరీ కాలేదన్నారు. ఘటనా స్థలాన్ని ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, క్రైం సీఐ ఎం.కృపానందం పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది.

10 న కాంట్రాక్ట్- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ

మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు


అమలాపురం రూరల్: ఏపీ అమరావతి కాంట్రాక్ట్- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రథమ మహాసభను ఈ నెల 10వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్నట్టు సంఘ కోనసీమ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.శ్రీనివాస్, గంటి చిరంజీవి తెలిపారు. ఈదరపల్లి అంబేడ్కర్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి మెరుగైన జీతభత్యాలు,వైద్యం, ఆర్థిక,ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం మహాసభను జరుపుతున్నామమని అన్నారు. జిల్లా కార్యదర్శి హరినారాయణ, ఔట్ సోర్సింగ్ రాష్ట్ర నాయకులు సుమన్,నాని,కాశీ,రంగబాబు,గురునాధం జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి


గాత్ర కచేరి చేస్తున్న సూర్యగాయత్రి

బోట్‌క్లబ్(కాకినాడ): సరస్వతి గాన సభ 120వ సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సూర్యకళా మందిరంలో కాలికట్‌కు చెందిన సూర్యగాయత్రి గాత్ర కచేరి ప్రేక్షకులను అలరించింది. గణపతి కీర్తనతో ప్రారంభించి, రాగ మాలికలో పాడిన కీర్తనలు శ్రోతలను ఆద్యంతం మెప్పించింది. వయోలిన్‌తో పీఈ సునీల్‌కుమార్, మృదంగంతో పీవీ అనిల్‌కుమార్, తబలాతో ఎస్ ప్రశాంత్ చక్కని సహకారం అందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ

30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు అపహరణ


వలసపాకలలో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలన చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో గానుగుచెట్టు ఇంటి వద్ద సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తిరగటి వీరభద్రరావు ఇంట్లో చోరీ జరిగింది. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో సోమవారం మధ్యాహ్నం భార్యతో కలిసి దగ్గరలోని గుడారిగుంటలో అత్తారింటికి వెళ్ళాడు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి లోపల ఉన్న విలువైన బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయినట్టు గుర్తించి సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సర్పవరం సీఐ మురళీకృష్ణ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్రైమ్ డీఎస్పీ రాంబాబు, లా అండ్ ఆర్డర్ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. కేసు నమోదు చేశామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. సుమారు 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీ అయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

స్వామియే.. శరణమయ్యప్పా..

- ఏటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షధారులు
- కఠిన నియమాలు ఆచరిస్తూ నిష్టగా కొనసాగింపు
- వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత
- ఆరోగ్యం.. వ్యక్తిత్వ వికాసానికీ దోహదం


పడిపూజకు అందంగా తీర్చిదిద్దిన మంటపం


పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

రాయవరం/కొత్తపల్లి: అయ్యప్ప స్వామి దీక్ష.. క్రమశిక్షణ వైపు నడిపించే భక్తి మార్గం. కులమతాలకు అతీతంగా భక్తి, నియమాలతో సాగే అయ్యప్ప మాలధారణకు జిల్లాలో ఏటా ప్రాధాన్యం పెరుగుతోంది. కఠిన నియమాలు ఉంటాయని తెలిసి కూడా.. జ్యోతిస్వరూపుడిగా భావించే అయ్యప్ప స్వామి దీక్ష తీసుకునేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు. నాలుగు దశాబ్దాల కిందట జిల్లాలో కేవలం వందల సంఖ్యలో స్వాములు మాలధారణ చేస్తే నేడు ఆ సంఖ్య 50 వేల వరకూ ఉందని అంచనా. హరిహరులకు ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసంలో మాల ధరిస్తున్నారు.

వాస్తవానికి మలయాళ మాసం వృశ్చిక సంకలనం (నవంబర్ 16) నుంచి జనవరిలో మకర సంక్రాంతి వరకూ అయ్యప్ప దీక్షా సమయంలో శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని తెరుస్తారు. ఆ రోజు నుంచి దీక్షల స్వీకరణ ప్రారంభమవుతుంది. శబరిమల సన్నిధానంలో జనవరి 1 నుంచి 20 వరకూ మకర విలక్కు (మకర జ్యోతి ఉత్సవం) నిర్వహిస్తారు. జ్యోతి దర్శనానికి వెళ్లే స్వాములు కార్తిక పౌర్ణమి, ఆ తర్వాత రెండు మూడు రోజుల వరకూ మాలలు వేసుకుంటారు. సంక్రాంతి రోజున జ్యోతి దర్శనం చేసుకుని దీక్ష విరమిస్తారు.

పీఠం ఏర్పాటు ఇలా..

మాల ధరించాక మండల దీక్ష పూర్తి చేసేందుకు ఇంట్లో స్థలం ఉంటే అక్కడే పీఠం ఏర్పాటు చేసుకోవాలి. లేకుంటే స్వాములందరూ కలసి సామూహికంగా పీఠం ఏర్పాటు చేసుకోవచ్చు. మండల దీక్ష కోసం సంకల్పం తీసుకుని కలశ స్థాపన చేసి, పీఠంపై ఒకసారి దేవతామూర్తుల చిత్రపటాలు ప్రతిష్ఠించాక.. 41 రోజుల దీక్ష ముగిసే వరకూ దానిని కదిపేందుకు వీలుండదు.

నియమాల తోరణం

- అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న వారు నల్లటి వస్త్రాలు ధరించాలి. శనిదేవుని చూపు స్వాములపై పడకూడదని ఇలా చేస్తారు. నలుపు ఆకర్షణకు దూరంగా ఉంటుంది. నలుపు రంగు ఉష్ణాన్ని గ్రహించడం వల్ల శీతాకాలంలో స్వాములు చలిని తట్టుకోగలుగుతారు.
- చలి కాలమైనప్పటికీ తట్టుకుంటూ మండల కాలం (41 రోజులు) చన్నీటి స్నానమే చేయాలి.
- భూతల శయనం (నేలపై నిద్రించడం).
- ఏకభుక్తం (ఒక్క పూటే ఆహారం భుజించడం). భిక్షాటన చేసిన బియ్యంతోనే స్వాములు వండుకోవాలి. నేటి రోజుల్లో అలా చేసేందుకు వీలు లేక ఇంట్లో తల్లో, జీవిత భాగస్వామో, తోటి స్వాములో భిక్ష వండుతున్నారు. ఉల్లి, వెల్లుల్లి లేకుండా సాత్విక ఆహారం తీసుకోవాలి.
- ఇలా 41 రోజుల మండల దీక్ష పూర్తయ్యాక స్వాములు ఇరుముడి కట్టుకుని శబరికొండకు పయనమవుతారు.
- మండల కాలంలో స్వాములు ఎటువంటి భేదభావం లేకుండా కలసిమెలసి ఉండాలి.
- అందరూ ఒక్కటేనని చాటి చెప్పే అయ్యప్ప దీక్షలో ఎదురుపడిన స్వాములు ఒకరికొకరు పాద పూజ చేసుకుంటారు. ప్రతి ఒక్కరిలో స్వామి ఉన్నాడనే విశ్వాసంతో ఈ పాద పూజలు చేస్తారు.

అయ్యప్ప చరిత్ర

హరిహర సుతుడు, మణికంఠుడిగా పిలిచే అయ్యప్ప పూజా సంప్రదాయం దక్షిణ భారతదేశంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. అయ్య (విష్ణువు), అప్ప (శివుడు) అనే పేర్ల సంగమంతో అయ్యప్ప నామం పుట్టింది. మహిషి అనే రాక్షసిని చంపిన అయ్యప్ప ప్రస్తుత కేరళ రాష్ట్రంలోని శబరిమలలో వెలసినట్టు పురాణాలు చెబుతున్నాయి.

ఇరుముడిధారులకే ఆ అర్హత

దీక్షలో ఇరుముడికి ప్రత్యేకత ఉంది. మండల దీక్ష తీసుకున్న స్వాముల శబరిమల ప్రయాణంలో మొదటి ఘట్టం ఇరుముడి. ఇరుముడి కట్టుకునే అయ్యప్ప స్వామి వేకువజామున ఇంటి గుమ్మం వద్ద కొబ్బరికాయ కొట్టి ఎవ్వరితోనూ మాట్లాడకుండా నేరుగా ఆలయానికి వెళ్లి గురుస్వామితో ఇరుముడి కట్టించుకుంటారు. ఇరుముడితో వెళ్లిన స్వాములకే శబరిమల అయ్యప్ప ఆలయంలో 18 మెట్లూ ఎక్కే అర్హత ఉంటుంది.

ఒక్కోసారి ఒక్కో పేరుతో..

మొదటిసారి మాల వేసే కన్నెస్వాములంటే అయ్యప్ప స్వామికి ఇష్టం. అందుకే ఎక్కువ మంది కన్నెస్వాములతో మాల వేయించేందుకు గురుస్వాములు ఇష్టపడతారు. మొదటిసారి మాల ధరించిన స్వాములను కన్నె స్వాములు (బాణం గుర్తు), రెండోసారి కత్తి స్వాములు (కత్తి), మూడోసారి గంట స్వాములు (గంట), నాలుగోసారి గద స్వాములు (గద), ఐదోసారి పేరుస్వాములు (ధనస్సు), ఆరోసారి జ్యోతి స్వాములు (జ్యోతి), ఏడోసారి రవి స్వామి (సూర్యుడు), ఎనిమిదో సారి చంద్రస్వామి (చంద్రుడు), తొమ్మిదోసారి వేలాయుధ స్వామి (వేలాయుధం), పదోసారి విష్ణుస్వామి (చక్రం), పదకొండోసారి శంఖస్వామి (శంఖం), పన్నెండోసారి నాగస్వామి (పాము), పదమూడో సారి వేణుస్వామి (మురళి), పద్నాలుగోసారి పద్మస్వామి (కమలం), పదిహేనోసారి త్రిశూల స్వామి (త్రిశూలం), పదహారోసారి కొండ స్వామి (కొండ), పదిహేడోసారి ఓం స్వామి (ఓంకారం), పద్దెనిమిదో సారి గురుస్వామి (కొబ్బరిచెట్టు)గా పిలుస్తారు.

అలరించే పడిపూజ

దీక్షలో అయ్యప్పలు చేసే పడి పూజ ఆసక్తికరంగా ఉండి, ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మిక భావనకు గురి చేస్తుంది. ఈ పూజ కోసం అరటి బోదెలతో అయ్యప్ప స్వామి గుడి నిర్మించి పూలు, పండ్లతో అందంగా అలంకరిస్తారు. పడిపూజలో 9, 18, 36, 54, 108 కలశాలతో ఎవరి స్తోమతకు తగినట్టు వారు పూజలు చేస్తారు. పూజలో భాగంగా భజన అనంతరం హారతి వెలిగించి అయ్యప్ప భక్తులు పడి తొక్కుతారు. గురుస్వామి పాడే పడి పాటకు అనుగుణంగా స్వాములు పడి తొక్కే విధానం ఆకట్టుకుంటుంది.

రైల్వే, ఆర్టీసీకి దండిగా ఆదాయం

నవంబర్ నుంచి జనవరి నెల వరకు అయ్యప్ప స్వాములు జిల్లా నుంచి శబరిమలకు రైళ్లు, బస్సులలో వెళ్తుంటారు. దాదాపు 70 శాతం మంది రైళ్లలో వెళ్తున్నారు. తద్వారా రైల్వేకు సుమారు రూ.6.3 కోట్ల ఆదాయం వస్తోంది. ఆర్టీసీ బస్సులపై కూడా స్వాములు శబరిమల యాత్ర చేస్తున్నారు. గత ఏడాది జిల్లా నుంచి 20 బస్సులలో స్వాములు శబరిమల వెళ్లగా ఆర్టీసీకి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది.

36వ సారి మాలధారణ



ఈ ఏడాది 36వసారి మాలధారణ చేశాను. ఏటా 50 మంది వరకూ భక్తులతో శబరిమల వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటున్నాను. ఈ ఏడాది కూడా శబరిమలకు పయనమవుతున్నాను. క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన అయ్యప్ప మాలతో సాధ్యమవుతాయి.

– కర్రి ఆదినారాయణరెడ్డి, గురుస్వామి, సోమేశ్వరం, రాయవరం మండలం

డాక్టర్ బాపిరాజుకి ఇండియన్ ఐకాన్ అవార్డ్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు డాక్టర్ పుప్పాల బాపిరాజుకు ఇండియన్ ఐకాన్ అవార్డ్ లభించింది. కేంద్ర ప్రభుత్వ అధీకృత సంస్థ, రాజస్థాన్‌కు చెందిన జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ ఈ అవార్డ్‌కు బాపిరాజును ఎంపిక చేశారు. ఈ మేరకు ఆ వివరాలను ఆయన మంగళవారం తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచేలా చిత్రాలు వేయించడం, అనేక సామాజిక సమస్యలపై జాగృతం చేసేలా చిత్రాలు గీయడంలో బాపిరాజు చేస్తున్న కృషికి ఈ అవార్డ్ ఇస్తున్నట్టు జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ డైరెక్టర్ నగేష్ తన సందేశం లో పేర్కొన్నారు. అవార్డ్ సాధించిన బాపిరాజును జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్.నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈఓ 2 రమారజని, ఎస్‌కేవీటీ స్కూలు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, నరసింహారావు, సీఆర్పీ జయంతి శాస్త్రి అభినందించారు.